

ప్రభుత్వ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం మండల కార్యదర్శి అశ్రియ్య

పాలకోడేరు : పాలకోడేరులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి శేషాపు అశ్రియ్య డిమాండ్ చేశారు. స్థానిక కాలనీలో సిపిఎం బృందం బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా కాలనీవాసులు అనేక సమస్యలను బృందం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అశ్రియ్య మాట్లాడుతూ కాలనీలో సరైన రోడ్ల సౌకర్యం లేదన్నారు. కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు రాళ్లు పైకి లేచి ఉండడంతో స్థానికులు అనేక ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. కనీసం డ్రెయినేజీ సౌకర్యం కూడా లేకపోవడంతో అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు నిర్మించుకున్న వాటికి బిల్లులు ఇప్పటివరకూ రాలేదని తెలిపారు. నాయకులు దున్న మరియమ్మ, లక్ష్మీ దుర్గ, వెంకట నరసమ్మ, సుబ్బలక్ష్మి, సారథి, లక్ష్మి, మణికుమారి పాల్గొన్నారు.

'పశ్చిమ' విద్యాశాఖ రూటే వేరు..!

పోలింగ్ కేంద్రాల పాఠశాలలకు 4న సెలవు ఇవ్వకుండా ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతర్
20 పోలింగ్ కేంద్రాల పాఠశాలల్లోనూ కొనసాగిన తరగతుల నిర్వహణ
ఎన్నికలు జరిగే అన్ని జిల్లాల్లోనూ సెలవు ఇచ్చినా ఇక్కడ భిన్నంగా పరిస్థితి
ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవు ఉత్తర్వుల జారీపైనా గందరగోళమే

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల కమిషన్ ఆదేశాలను పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖ బేఖాతర్ చేసింది. పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలలకు పోలింగ్ ముందు రోజు 4వ తేదీన, పోలింగ్ రోజు ఐదో తేదీన సెలవు ప్రకటించాలంటూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను తుంగలోతొక్కింది. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉపఎన్నికకు సంబంధించి జిల్లా విద్యాశాఖ వ్యవహరించిన తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో ఏర్పాటు చేసిన 20 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పాఠశాలలకు ఎటువంటి సెలవు ప్రకటించకుండా నాలుగో తేదీన యథావిధిగా తరగతులు కొనసాగించిన పరిస్థితి నెలకొంది. బుధవారం ఎన్నికల సిబ్బంది, పోలీసులు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నా తరగతులు కొనసాగుతుండడంతో ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. తమకు సెలవు ప్రకటనపై అధికారుల నుంచి ఆదేశాలు రాలేదని స్కూల్ ఉపాధ్యాయులు చెప్పడంతో ఎన్నికల సిబ్బంది విస్తుపోయిన పరిస్థితి. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు ఎన్నికల కమిషన్ ఆదేశాలను అధికారులు తూచా తప్పకుండా పాటించాల్సి ఉంటుంది. ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలు ఆరు జిల్లాలో జరుగుతుండగా, పశ్చిమలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరించిన పరిస్థితి నెలకొందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో జిల్లా విద్యాశాఖ తీరుపట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పాలకోడేరులో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రం హైస్కూల్‌ను తెరిచిన వైనం

ఉపాధ్యాయులకు సెలవు ఉత్తర్వులపైన ఆఖరు వరకూ గందరగోళమే..

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి పోలింగ్ సందర్భంగా ఈ నెల ఐదో తేదీ పోలింగ్ రోజు ప్రభుత్వ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవు ఇవ్వాల్సి ఉంది. ఎన్నికలు జరుగుతున్న మిగిలిన ఐదు జిల్లాల్లోనూ మంగళవారం సాయంత్రమే సెలవుకు సంబంధించిన ఉత్తర్వులను జిల్లా విద్యాశాఖ అధికారులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల్లో ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ ఓటర్లకు వెసులుబాటు కల్పించాల్సిందిగా పేర్కొనడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమర్ ప్రసాద్ ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశిస్తూ మంగళవారం అందుకు సంబంధించిన ఉత్తర్వులు సైతం జారీ చేశారు. ఈ ఆదేశాలను పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖ అధికారులు తుంగలోతొక్కి, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఉపాధ్యాయులకు సెలవు ఉత్తర్వులు జారీచేయాలంటూ ఉపాధ్యాయ సంఘం నేతలు అధికారులను కలిసి విన్నవించుకోవాల్సి పరిస్థితి ఏర్పడింది. బుధవారం సాయంత్రానికి మెసెజ్ రూపంలో ఉపాధ్యాయులకు సెలవు ఇస్తున్నట్లు ప్రకటించి మమ అనిపించారు. ఎన్నికలు జరుగుతున్న అన్ని జిల్లాల్లో కంటే పశ్చిమలోనే అత్యధికంగా 3,729 మంది ఓటర్లు ఉన్నారు. ఉపాధ్యాయ ఉప ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించాల్సిన విద్యాశాఖ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరు పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలింగ్ బూతులు ఏర్పాటు చేసిన పాఠశాలల్లో సెలవు ప్రకటించాల్సి ఉన్నప్పటికీ ఆదేశాలను పాటించకుండా ఒంటెద్దు పోకడగా వ్యవహరించడంపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలి

కలెక్టర్‌కు పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి, యుటిఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి - భీమవరం

ఉభయగోదావరి జిల్లాల్లో జరుగుతున్న టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి కోరారు. బుధవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగారాణిని పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని కోరారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు పూర్తి రోజు స్పెషల్ క్యాజువల్ వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నూరు శాతం ఉపాధ్యాయులకు ఓటు ఉన్న పాఠశాలలకు సెలవు ప్రకటించాలని లేదా ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్ విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, కోశాధికారి బి.పట్టాభిరామయ్య ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి, యుటిఎఫ్ నేతలు

ఏలూరు జిల్లాలో పలుచోట్ల స్వల్ప భూ ప్రకంపనలు

ఇళ్లల్లోంచి బయటకు జనం పరుగులు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల కేంద్రంలోని సీతారామనగరం నుంచి దామరచర్ల వరకూ పలు గ్రామాల్లో బుధవారం ఉదయం 7.40 నిమిషాలకు భూమి కనిపించింది. ఐదు సెకన్ల పాటు భూమి కంపించడంతో ఇంటిపై రేకులు కదిలాయని స్థానికులు తెలిపారు. కోతులు అలజడి చేస్తున్నాయేమోనని వెళ్లి చూడగా ఏమీ కనిపించలేదని దామరచర్ల నివాసి బల్లెం రాము తెలిపారు.

చింతలపూడి : మండలంలో భూ ప్రకంపనలు కలకలం సృష్టించాయి. ఒక్కసారి ప్రజలందరూ ఉలిక్కిపడ్డారు. బుధవారం ఉదయం 7:30 సమయంలో చింతలపూడి, పరిసర గ్రామాల్లో పలు సెకన్ల పాటు భూమి కంపించింది. భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశామని స్థానికులు తెలిపారు. కొద్ది సెకన్ల పాటు వైబ్రేషన్ రావడంతో ప్రజలు కంగారు పడినట్లు స్థానికులు చెబుతున్నారు.

టి.నరసాపురం : మండలంలో బుధవారం ఉదయం భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఉదయం సుమారు 7:28 నిమిషాల సమయంలో భూమి ఒక్కసారిగా కదిలినట్లు అనిపించింది. భూ ప్రకంపనలు గుర్తించిన టి.నరసాపురంలో కొందరు భయంతో ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీసినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే టి.నరసాపురం ప్రధాన సెంటర్లో భూమి ఊగినట్లు దృశ్యాలు సిసి కెమెరాలో కూడా నమోదైనట్లు స్థానికులు చెబుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో కూడా ఇటువంటి భూ ప్రకంపనలు చోటు చేసుకోవడం ఒక్క సారిగా చర్చనీయాంశంగా మారింది.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలో రెండు సెకన్ల పాటు భూమి కంపించడంతో ప్రజలు భయాందోళన చెందారు. బుధవారం తెల్లవారుజామున కన్నాపురం రోడ్డులోని అపోలో స్కూల్, సురక్ష హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో భూ ప్రకంపనలు వచ్చాయని స్థానికులు తెలిపారు. షెల్ఫ్‌లోని సామగ్రి, కుర్చీలు కదలడం వంటి ఘటనలు జరిగాయని తెలిపారు. అలాగే కుంతల గూడెం (ఆరిపాటి) గ్రామంలో, కొయ్యలగూడెం తహశీల్దార్ ఆఫీసు దగ్గరలో భూమి కంపించినట్లు స్థానికులు చెబుతున్నారు.

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

20 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు : కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం



ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉపఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ సిబ్బంది, మెటీరియల్ ఆర్‌డిఒల పర్యవేక్షణలో ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లినట్లు తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉపఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గురువారం బ్యాలెట్ పద్ధతిలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత ఆయా పోలింగ్ సామగ్రి భీమవరం జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన మధ్యంతర రిసీప్షన్ కేంద్రానికి తరలించి, అదేరోజు రాత్రి బ్యాలెట్ బాక్సు, ఇతర పత్రాలు అత్యంత భద్రత మధ్య కాకినాడకు తరలిస్తామని తెలిపారు. ఓట్ల లెక్కింపు ఈ నెల 9వ తేదీన కాకినాడలో నిర్వహించడం జరుగుతుందన్నారు. సహాయ రిటర్నింగ్ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు వ్యవహరిస్తారని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు పశ్చిమగోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు, 26 మంది పిఒలు, 78 మంది ఎపిఒలు, 26 మంది మైక్రో అబ్జర్వర్లు, 20 మంది రూట్ ఆఫీసర్లు, జోనల్ ఆఫీసర్లుగా ముగ్గురు ఆర్‌డిఒలు, ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొత్తం ఓటర్ల సంఖ్య 3,729 మంది కాగా పురుషులు 2,268 మంది, మహిళలు 1,461 మంది ఉన్నారన్నారు. మండలాల వారీగా అత్తిలిలో 90 మంది, ఆకువీడులో 90 మంది, ఆచంటలో 63 మంది, భీమవరంలో 759 మంది, గణపవరంలో 66 మంది, ఇరగవరంలో 53 మంది, కాళ్లలో 52 మంది, మొగల్తూరులో 88 మంది, నరసాపురంలో 425 మంది, పెంటపాడులో 73 మంది, పోడూరులో 71 మంది, పాలకోడేరులో 102 మంది, పెనుమంట్రలో 85 మంది, పెనుగొండలో 156 మంది, పాలకొల్లులో 480 మంది, తాడేపల్లిగూడెంలో 377 మంది, తణుకులో 407 మంది, ఉండిలో 69 మంది, వీరవాసరంలో 129 మంది, యలమంచిలిలో 94 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఆర్‌డిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ మెటీరియల్ తరలింపును, సిబ్బంది, ఇతర అనుబంధ విధులను ఆర్‌డిఒలు ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసి రాజు, ఖతీబ్ కౌసర్ బానో, అర్బన్ తహశీల్దార్లు, ఇన్‌ఛార్జి ఎలక్షన్ సూపరింటెండెంట్ మద్రాపు సన్యాసిరావు, ఎన్నికల విధులు ఇతర అధికారులు పర్యవేక్షించినట్లు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 20 పోలింగ్ కేంద్రాలు ఇలా..

అత్తిలిలో ప్రజా పరిషత్ అప్పర్ ప్రయిమరీ బాలుర పాఠశాల
ఆకివీడులో ఎస్ఎస్ఎన్ జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్
ఆచంటలో ఎంవిఆర్ గవర్నమెంట్ హైస్కూల్
భీమవరం అర్బన్‌లో ఎస్‌సిహెచ్‌బిఆర్ఎం హై స్కూల్
గణపవరంలో శ్రీసిహెచ్‌బిఆర్ జెడ్‌పి బాయ్స్ హైస్కూల్
ఇరగవరంలో జిల్లా పరిషత్ హైస్కూల్
కాళ్లలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్
మొగల్తూరులో పెనుమత్స రంగరాజు జిల్లా పరిషత్ హైస్కూల్
నరసాపురంలో మున్సిపల్ అప్పర్ ప్రయిమరీ బాలికల పాఠశాల
పెంటపాడులో గవర్నమెంట్ పోస్ట్ బేసిక్ స్కూల్
పోడూరులో డిఎస్.రాజు జిల్లా పరిషత్ హై స్కూల్
పాలకోడేరులో జిల్లా పరిషత్ హై స్కూల్
పెనుమంట్రలో భవిత ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ రిసోర్స్ సెంటర్
పెనుగొండలో ఎంపిడిఒ కార్యాలయం మీటింగ్ హాల్
పాలకొల్లులో బివిఆర్ఎం మున్సిపల్ హైస్కూల్ 28వ వార్డు
తాడేపల్లిగూడెంలో మున్సిపల్ హైస్కూల్
తణుకులో జాస్తి సీత మహాలక్ష్మి గర్ల్స్ హైస్కూల్
ఉండిలో జిల్లా పరిషత్ హైస్కూల్
వీరవాసరంలో ఎంఆర్‌కె జెడ్‌పి హైస్కూల్
యలమంచిలిలో మండల ప్రజా పరిషత్ ప్రయిమరీ స్కూల్

నేడు ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్..!

అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసిన అధికారులు
ప్రభుత్వ ఉపాధ్యాయ ఓటర్లకు ప్రత్యేక సెలవు మంజూరు
ప్రయివేటు విద్యా సంస్థల్లోని ఓటర్లకు వెసులుబాటు ఆదేశాలు
ఏలూరులో 20, పశ్చిమలో 20 పోలింగ్ కేంద్రాలు
రెండు జిల్లాలో 6,396 మంది ఉపాధ్యాయ ఓటర్లు
ఎన్నికల బరిలో గోపీమూర్తితో సహా ఐదుగురు అభ్యర్థులు
ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్
9న కాకినాడలో ఓట్ల లెక్కింపు



పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల ప్రక్రియ చివరి అంకానికి చేరింది. నవంబర్ 11వ తేదీన ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల ఐదో తేదీ గురువారం ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లనూ అధికారులు పూర్తి చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పోలింగ్ ప్రక్రియ ప్రారంభంకానుంది. సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ జరగనుంది. ఏలూరు జిల్లాలో 20, పశ్చిమలో 20 మొత్తం 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు జిల్లాల్లోని ఉపాధ్యాయ ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు ఏలూరు జిల్లాలో 2,667 మంది, పశ్చిమలో 37,29 మంది ఓటర్లు ఉన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ 896 మంది ఓటర్ల వరకూ ఓటుహక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి పిఒ, ఒపిఒ, మైక్రో అబ్జర్వర్లు మొత్తం ఏలూరు జిల్లాలో 144 మందిని, పశ్చిమలో 130 మందిని నియమించారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు వెబ్ క్రాస్టింగ్‌కు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ఓటు హక్కు వినియోగించుకునే ప్రభుత్వ ఉపాధ్యాయ ఓటర్లకు ప్రత్యేక సెలవు మంజూరు చేస్తూ ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రయివేటు విద్యా సంస్థల్లోని ఉపాధ్యాయ ఓటర్లకు ఓటు హక్కు వినియోగించునేందుకు వెసులుబాటు కల్పించాలని యాజమాన్యాలకు అధికారులు ఉత్తర్వుల్లో కోరారు. పశ్చిమగోదావరి జిల్లాలో విద్యాశాఖ అధికారులు మాత్రం బుధవారం వరకూ సెలవుపై ఆదేశాలు జారీ చేయకపోవడంతో ఉపాధ్యాయుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర అసహనం వ్యక్తం చేసిన పరిస్థితి కొనసాగింది. ఓటు హక్కు వినియోగించుకునే ఉపాధ్యాయులు ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, పాస్‌పోర్ట్ గానీ ఎన్నికల కమిషన్ పేర్కొన్న పది రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి పోలింగ్ కేంద్రానికి తీసుకువెళ్లాల్సి ఉంటుంది. బ్యాలెట్ పద్ధతిలో ఎంఎల్‌సి ఎన్నిక జరగనుంది. ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో మొత్తం ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. షేక్ సాబ్జీ మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. గెలిచిన అభ్యర్థి 2027 మార్చి వరకూ పదవిలో ఉంటారు.

ఇద్దరి మధ్యే పోటీ..

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో ఐదుగురు అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ప్రధానంగా ఇద్దరి మధ్యే పోటీ నెలకొంది. పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి, గంధం నారాయణరావు మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. ప్రస్తుతం ఎన్నిక జరుగుతున్న స్థానంలో గతంలో పిడిఎఫ్ అభ్యర్థి షేక్ సాబ్జీ గెలుపొందారు. ఆయన రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఉప ఎన్నిక వచ్చింది. దీంతో ఈసారి సైతం పిడిఎఫ్ అభ్యర్థే ప్రధానంగా రేసులో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ నెల తొమ్మిదో తేదీన కాకినాడలో ఎన్నికల కౌంటింగ్ జరగనుంది.

పోటీలో ఉన్న అభ్యర్థులు వీరే..

1. బొర్రా గోపీమూర్తి
2. గంధం నారాయణరావు
3. దీపిక పులుగు
4. డాక్టర్ నాగేశ్వరరావు కావల
5. నామన వెంకటలక్ష్మి

ఓటర్ల వివరాలు..

జిల్లా	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	మొత్తం
ఏలూరు జిల్లా	1,489	1,178	2,667
పశ్చిమగోదావరి	2,268	1,461	3,729

ఉపాధ్యాయులకు స్పెషల్ క్యాజువల్ లీవ్ : డిఆర్‌ఒ

భీమవరం : జిల్లాలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో అర్హులైన ప్రతిఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. ఈమేరకు ఈనెల 5వ తేదీన స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను ప్రభుత్వం ప్రకటించినట్లు ఎంఎల్‌సి ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి, డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలని వెంకటేశ్వర్లు కోరారు.

తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సిఐగా స్వరాజ్యలక్ష్మి



తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐగా ఎ.స్వరాజ్యలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సిఐగా పనిచేసిన కళ్యాణ్ చక్రవర్తి వేరే ప్రాంతానికి బదిలీ అవ్వడంతో ఆయన స్థానంలో స్వరాజ్యలక్ష్మి నియమితులయ్యారు. ఈమె గతంలో ఇక్కడ ఎక్సైజ్ ఎస్ఐగా పనిచేశారు. ఈ సందర్భంగా స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ, అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తే వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బెల్ట్ షాపులకు సంబంధించిన ఏవిధమైన సమాచారం ఉన్నఎడల తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయానికి తెలియజేయాలని ఆమె సూచించారు.

ఎంఎల్‌సి ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

పోలింగ్ కేంద్రాల పరిశీలనలో అధికారులు

ప్రజాశక్తి - ఉండి

నేడు ఉండి జెడ్‌పి పాఠశాలలో జరగనున్న ఉమ్మడి తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లా టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికకు పగడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఉండి మండల తహశీల్దార్ కావడి నాగార్జున, ఎంపిడిఒ శిష్టు రవీంద్ర అన్నారు. బుధవారం సాయంత్రం జెడ్‌పి పాఠశాలలో ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ స్టేషన్లో 69 ఓట్లు ఉన్నాయని, ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే ఉపాధ్యాయులకు రేపు సెలవు ఇచ్చినట్లు, ఎన్నికల ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వారు తెలిపారు. పోలింగ్ స్టేషన్ నుంచి భారతీయ నాగరిక్ సురక్షిత సంహిత చట్టం-2023 అనుసరించి 250 మీటర్ల వరకు నిషేధం విధించినట్లు వారు వివరించారు. పోలీస్ స్టేషన్ వద్ద సెక్షన్ 163 అమలు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ రత్నకుమార్, మండల విస్తరణ అధికారి వెంకట్ రెడ్డి, పలువురు అధికారులు ఉన్నారు.

మొగల్తూరు : శాసనమండలి ఉపాధ్యాయుల నియోజకవర్గం ఎంఎల్‌సి పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసామని తహశీల్దార్ కె.రాజ కిషోర్ తెలిపారు. మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 116 పోలింగ్ కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. పోలింగ్ సామాగ్రి సిబ్బందికి అందించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పోలింగ్ కేంద్రంలో 87 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారన్నారు. 66 మంది ఉపాధ్యాయులు 21 మంది ఉపాధ్యాయురాళ్లు ఉన్నారని ఆయన తెలిపారు. ఆయన వెంట ఎఎస్ఐ యు.రాజేంద్ర, పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎఇ మోహన్ రావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మండల కేంద్రం మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శాసనమండలి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి నియోజకవర్గం పోలింగ్ కేంద్రాన్ని ఆర్‌డిఒ దాసిరాజు బుధవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ శాతంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట తహశీల్దార్ కె.రాజకిషోర్, ఇన్‌ఛార్జి ఆర్ఐ ముచ్చర్ల నిరంజన్, సిపిఎం నాయకులు యడ్ల చిట్టిబాబు, యుటిఎఫ్ నాయకులు చింతపల్లి కృష్ణమోహన్ ఉన్నారు.



నరసాపురం : పోలింగ్ సామగ్రి సిద్ధం చేస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం : ఈనెల 5వ తేదీ గురువారం జరగనున్న ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లూ అధికార యంత్రాంగం పూర్తి చేసినట్లు ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ బానో తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, ఇరగవరం, అత్తిలి కేంద్రాలకు పోలింగ్ సామగ్రి పంపిణీ చేశారు. తాడేపల్లిగూడెం డివిజన్లో మొత్తం వెయ్యి మంది ఓటర్లకు గాను 574 మంది పురుషులు, 426 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గురువారం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా కట్టుదిట్టమైన పోలీస్ భద్రతను ఏర్పాటు చేసినట్లు ఆర్‌డిఒ తెలిపారు.

తణుకు రూరల్ : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా శాసనమండలి ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలో రెండు పట్టణాలు, ఐదు మండలాలు ఉన్నాయి. మొత్తం ఐదు పోలింగ్ చేసిన కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల సామాగ్రిని బుధవారం తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ బను పర్యవేక్షణలో పోలింగ్ కేంద్రాలకు పంపిణీ చేశారు. డివిజన్ పరిధిలో మొత్తం వెయ్యి ఓట్లు ఉన్నాయి. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరగనున్నది. తహశీల్దార్ల పర్యవేక్షణలో ఎంఎల్‌సి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ బనో తెలిపారు.

పాలకొల్లు : ఈనెల 5న జరిగే ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల ఏర్పాట్లు పూర్తి అయినట్లు పాలకొల్లు తహశీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని ఆయన కోరారు. పాలకొల్లు పట్టణంలోని బిఆర్ఎంవి మున్సిపల్ హైస్కూల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు. ప్రశాంతంగా పోలింగ్ మెటీరియల్ ఎన్నికల కేంద్రంకు తరలించామన్నారు. పాలకొల్లులో మొత్తం 480 మంది ఉపాధ్యాయులు తమ ఓటుహక్కు వినియోగించుకోవలసి ఉందని అన్నారు. పురుషులు 289, మహిళలు 191 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకోవలసి ఉంది.

నరసాపురం : సబ్ డివిజన్ పరిధిలోని ఎనిమిది పోలింగ్ బూత్‌లలో గురువారం ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం ఎనిమిది మండలాల్లో 1450 మంది ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా పాలకొల్లులోని బిఆర్ఎం స్కూల్లోని బూత్లో 480, నరసాపురం స్టీమర్ రోడ్లోని మున్సిపల్ స్కూల్ బూత్లో 425, మొగల్తూరు ఉన్నత రంగరాజు జెడ్‌పి స్కూల్లో 88, అచంట ఎంవిఆర్ హైస్కూల్ 63, పెనుగొండ ఎంపిడిఒ కార్యాలయం 156, పోడూరు బిఎస్ రాజు జెడ్‌పి స్కూల్లో 71, యలమంచిలి హైస్కూల్లో 94, పెనుమంట్ర భవిత స్కూల్లో 156 మంది ఓటర్లు ఉన్నారు. ప్రతి బూత్‌కు నలుగురు చొప్పున సిబ్బందిని నియమించారు. మరో ఎనిమిదిని అదనంగా ఏర్పాటు చేశారు. రూట్ అధికారులుగా తహశీల్దార్‌లను నియమించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం పోలీస్ సిబ్బందిని 102 మందిని నియమించారు. డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద పర్యవేక్షణలో ప్రతి నియోజకవర్గంలో మూడు పెట్రోలింగ్, ఒక మొబైల్ పార్టీ సిబ్బంది, ప్రతి బూత్ వద్ద నలుగురు నుంచి ఐదుగురు సిబ్బంది విధుల్లో ఉంటారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో విధుల్లో నియమించిన సిబ్బందికి స్టేషనరీ, పోలింగ్ సామాగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసిరాజు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి అనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. ఎమైనా ఇబ్బందులు వస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను భీమవరం విష్ణు కాలేజీకి పోలీస్ బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని సూచించారు.

ఆచంట: ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉపాధ్యాయులంతా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ విజయ కనకరాజు పిలుపునిచ్చారు. ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జరగనున్న ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతాయన్నారు. ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వి.కిషోర్, సెక్రటరీ ఎం.హనుమంతరావు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ సజావుగా నిర్వహించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

పాలకొల్లు :పోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ స్టేషన్‌కు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించి, దిశానిర్దేశం చేశారు. ఈనెల 5న నిర్వహించే ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను పూర్తిచేసి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పాటించి, వివాదాలకు తావివ్వరాదని ఆదేశించారు. ఆర్‌డిఒ దాసిరాజు, తహశీల్దారు ఎస్ఎం.ఫాజీల్, మండల వ్యవసాయ శాఖ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామసభలను వినియోగించుకోవాలి

ఉండి : భూ రీసర్వేపై ఏదైనా సమస్యలుంటే వెంటనే ఈనెల 6వ తేదీ నుంచి జరిగే గ్రామసభల దృష్టికి తీసుకువచ్చి, సమస్య పరిష్కారానికి ప్రజలందరూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రజలకు ఉండి తహశీల్దార్ కావడి నాగార్జున విజ్ఞప్తి చేశారు. బుధవారం ఉండి మండల తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా గ్రామ సభలపై రెవెన్యూ సదస్సులను ఈనెల 6వ తేదీ నుంచి జనవరి 30వ తేదీ వరకు మండలంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ గ్రామసభలపై రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని వారి భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ సమావేశంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్, మండల సర్వేయర్ రత్నావళి, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

నరసాపురం : నరసాపురం పట్టణంలోని మున్సిపల్ హెడ్ వర్క్స్ వాటర్ క్లారిఫ్లోక్యులేటర్ క్లీనింగ్ పనుల కారణంగా ఈనెల 5వ తేదీ గురువారం సాయంత్రం నీటి సరఫరా ఉండదని కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 6న శుక్రవారం ఉదయం యధావిధిగా నీటి సరఫరా జరుగుతుందన్నారు. ప్రజలు మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

ఘనంగా భగవాన్ పుట్టినరోజు

భీమవరం టౌన్ : నాటక, సాహిత్య రంగాల అభివృద్ధికి అనుక్షణం ఆకాంక్షించే కళా తపస్వి భగవాన్ అని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్ మంతెన రామ్‌కుమార్ రాజు, పలువురు అన్నారు. బుధవారం ప్రముఖ ఆడిటర్, చైతన్య భారతి వ్యవస్థాపక అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్ పుట్టినరోజు వేడుకలను స్థానిక హెరిటేజ్ టవర్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్ మంతెన రామ్‌కుమార్ రాజు, న్యాయవాది రాయప్రోలు శ్రీనివాసమూర్తి, వెస్ట్ బెర్రీ స్కూల్ డైరెక్టర్ నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, శోభన్ బాబు సేవా సమితి సభ్యుడు భట్టిప్రోలు శ్రీనివాసరావు, కెజిఆర్ఎల్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ కట్రెడ్డి సత్యనారాయణ, మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు మాట్లాడుతూ చైతన్య భారతి నాటక పరిషత్ ద్వారా ఎన్నో నాటకాలను భీమవరంలో ప్రదర్శించి, కళాకారులను సత్కరించడం గొప్ప విశేషమని అన్నారు. అనంతరం భగవాన్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు, సమకాలీన పరిస్థితులను ప్రతిబింబించేదే నాటకాలు, సాహిత్యాలేనని, కవులు, సాహితీవేత్తలు తమ రచనలతో ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు విద్యుత్ 33/11 కేవీ ఉప కేంద్రంలో బుధవారం పాత ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేశారు. దీని విలువ రూ.42 లక్షలని అధికారులు పేర్కొన్నారు. గత 3 నెలల క్రితం ఫెయిల్ అయిన, 5 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో గురువారం అధికారులు కొత్త 5 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పెట్టారు. ఇప్పటి వరకు మార్టేరు సబ్ స్టేషన్ పరిధిలో మార్టేరు, నెగ్గిపూడి, వెలగలేరు, సత్యవరం, కొయ్యేటిపాడు గ్రామముల కొన్ని సర్వీసెస్ ఆలమూరు సబ్ స్టేషన్ నుంచి సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఈ పని మార్టేరు నుంచి జరుగుతుంది. నరసాపురం ఎఇ కె.మధుకుమార్, ఇఇ బి.రఘు, ట్రాన్స్‌ఫార్మర్స్, ఎడిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పెనుమంట్ర : ఆచంట నియోజకవర్గంలో 22 మంది వివిధ చికిత్సలు పొంది సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ సిఫార్సు మేరకు రూ.20 లక్షల 72 వేల 405 నిధులు మంజూరు అయ్యాయి. బుధవారం సాయంత్రం ఆ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. పొలమూరుకు చెందిన కౌరు శ్రీనివాస్ రూ.2 లక్షల 39 వేలు, పెనుమత్స లక్ష్మి రూ.61 వేల చెక్కును పితాని సత్యనారాయణ చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు పెనుమత్స రాఘవేంద్ర రాజు, ఆచంట నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ ఆలీ జిన్నా, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి గూడూరి మురళీ, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి చింతపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పనిభారం తగ్గించాలి

అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిడిఒకు వినతి

గణపవరం : ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు పనిభారం తగ్గించాలని కోరుతూ బుధవారం మండల పంచాయతీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు తమ సొంత ఖర్చులతో నిర్వహించి, ప్రజలకు ప్రజారోగ్యం కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సర్వేలు నిర్వహించి సర్వే నివేదికలు అధికారులకు అందజేస్తున్నప్పటికీ సర్వే చేయడానికి సచివాలయ సిబ్బంది కార్యదర్శుల మాట వినటం లేదని అన్నారు. రిపోర్టు సరైన సమయంలో అందజేయటం లేదని కార్యదర్శులను బాధ్యులను చేయటం ఏమాత్రం సమంజసంగా లేదని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం జారీ చేస్తున్న పనులతో శారీరకంగా ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే పనిభారం తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి కవచం బహూకరణ

నరసాపురం : మండలంలోని కొప్పర్రు గ్రామంలో కొలువైయున్న వల్లి దేవసేన సమేత సుబ్రమణేశ్వరస్వామికి రూ.5 లక్షలు విలువ చేసే వెండి కవచం బహూకరించారు. గ్రామానికి చెందిన జనసేన సీనియర్ నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్, సునీత దంపతులు స్వామివారికి వెండి కవచం, ఐదు పడగలు కలిగిన వెండి సర్పం బహూకరించారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, గ్రామస్థులు పాల్గొన్నారు.



స్వామివారికి బహూకరించిన వెండి కవచం

నేరాలు - ఘోరాలు

మద్యం విక్రేతల అరెస్ట్

తణుకు రూరల్ : తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న గరగ శ్రీను అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ తణుకు సిఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎలక్షన్స్ నేపథ్యంలో మద్యం షాపులకు, బార్లకు సీల్ వేయడంతో ఇతను ముందుగానే మండలంలో వివిధ మద్యం షాపుల నుంచి కొనుగోలు చేసి డ్రై డే నేపథ్యంలో వీటిని అధిక ధరలకు విక్రయిస్తున్నాడని, ఈ క్రమంలో దాడి చేసి పట్టుకోవడం జరిగిందని తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐ బి.లక్ష్మి, హెచ్‌సి ఎన్.అప్పలస్వామి, కానిస్టేబుల్ జి.గంగాధర్ పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే వారిపై కఠినచర్యలు తప్పవని తెలిపారు.

తాడేపల్లిగూడెం: అక్రమ మద్యం బాటిల్స్ కలిగి ఉన్న ఓ వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు తాడేపల్లిగూడెం పట్టణ ఎస్ఐ సిఐ ఎ.సుబ్రహ్మణ్యం బుధవారం ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో పట్టణ సిఐ సుబ్రహ్మణ్యంకు అందిన సమాచారం మేరకు పట్టణ ఎస్ఐ నాగరాజు వారి సిబ్బందితో కలిసి తాడేపల్లిగూడెం గాంధీ బొమ్మ సెంటర్లో మేడిచర్ల మోహన్ వద్ద నుంచి 46 మద్యం బాటిల్స్ స్వాధీన పరచుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రదేశాలలో దాడులు నిర్వహించి ముద్దాయిను అరెస్టు చేసినట్టు తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సిఐ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది కలసి బుధవారం దాడులు నిర్వహించి యాగర్లపల్లిలో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 09 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనపరుచుకుని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

ఆచంట : మండలంలోని వల్లూరు గ్రామంలో మద్యం షాపులలో మద్యం బాటిళ్లు కొనుగోలు చేసుకుని వాటిని ఎక్కువ ధరకు అక్రమంగా అమ్ముతున్న బొర్రా రామచంద్ర మూర్తిని అరెస్ట్ చేసి అతని వద్ద మంజీర బ్లూ ప్రీమియం డీలక్స్ విస్కీ 180 ఎంఎల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. అతన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్లన్నీ గోతులమయం..!

ప్రభుత్వ ప్రకటనలు గాలి మాటలేనా..!
అర్ధాంతరంగా ఆగిపోయిన పని
లబోదిబోమంటున్న ప్రయాణికులు
గోతులను పూడ్చాలని వేడుకోలు



అధ్వానంగా ఉన్న రహదారి

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన రోడ్లపై గోతుల పూడిక అంతంతమాత్రంగానే సాగింది. మొదట నాలుగు రోజులు జరిగిన పని ఆ తర్వాత అర్ధాంతరంగా ఆగిపోయింది. ప్రస్తుతం మండలమంతా రోడ్లన్నీ గోతులమయంగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన గోతుల పూడిక కార్యక్రమంతో ప్రజలు ఎంతో ఆనందించారు కాని ఆనందం అమల్లోకి ఎప్పటికి వస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అర్ధాంతరంగా మొదలుపెట్టిన పని అక్కడే ఆగిపోయింది. గోతుల్లో ప్రయాణించేటప్పుడు ప్రజలు ఎక్కడికక్కడ ఇబ్బంది పడుతున్నారు. కొన్ని రోడ్లపై ప్రయాణించేందుకే పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయని వాపోతున్నారు. అసలు ఆ గోతులు పూడుస్తారో లేదో అనే సందేహం ప్రజల్లో వ్యక్తమవుతుంది. ప్రకటనలకు అనుగుణంగా వెంటనే గోతులు పూడ్చండి మహాప్రభో అంటూ ప్రజలు కోరుతున్నారు.

చిరు వ్యాపారుల వివరాలను సేకరించండి

ఎంపిడిఒ రవీంద్ర

ప్రజాశక్తి - ఉండి

సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా వ్యాపారస్తుల వివరాలను సేకరించి ఎంఎస్ఎంఇ సర్వే అండ్ సపోర్ట్ యాప్‌లో నమోదు చేయాలని ఉండి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.రవీంద్ర గ్రామస్థాయి అధికారులకు సూచించారు. బుధవారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు మండలంలోని చిరు వ్యాపారం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నిర్వాహకుల వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేయాల్సిన బాధ్యత గ్రామస్థాయి అధికారులపై ఉందన్నారు. నేటి నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీలోగా ఈ వివరాలను సేకరించాలన్నారు. ఈ వివరాలను సేకరించడంలో అధికారులు ఎవరూ అలసత్వం ప్రదర్శించరాదని, వెంటనే పనిలో నిమగ్నమై వారి వివరాలు పూర్తిస్థాయిలో సేకరించాలని, లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన గ్రామస్థాయి అధికారులను హెచ్చరించారు. సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమల నిర్వాహకులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందాల్సిన పథకాలకు ఈ వివరాలు చాలా ఉపయోగపడతాయని వాంద్రం గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ యాప్‌లో ఏవిధంగా వ్యాపారస్తుల వివరాలను నమోదు చేయాలనే అంశాలను ప్రవీణ్ కుమార్ మిగిలిన అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



యాప్ వినియోగం గురించి వివరిస్తున్న ప్రవీణ్‌కుమార్

టిడ్కో గృహాలు పున:ప్రారంభించాలి

పట్టణాభివృద్ధి శాఖామంత్రి పొంగూరు నారాయణను కోరిన మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో మిగిలిన ఎన్‌టిఆర్ టిడ్కో గృహాల పనులు వెంటనే పున ప్రారంభించి, నిర్మించాలని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. ఈమేరకు మంత్రి నిమ్మల విజయవాడలోని మంత్రి నారాయణ స్వగృహంలో బుధవారం కలిసి కోరారు. పాలకొల్లు నియోజకవర్గంలో గత టిడిపి ప్రభుత్వం నిర్మాణం చేసిన ఎన్‌టిఆర్ టిడ్కో ఇళ్లను గత వైసిపి ప్రభుత్వం నిలిపివేసి, లబ్ధిదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసినట్లు నిమ్మల తెలిపారు.

లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు, నరసాపురం, పోడూరు లారీ సంఘం నూతన కార్యవర్గం బుధవారం బాధ్యతలు చేపట్టారు. సంఘ అధ్యక్షులుగా వరహాలు, కార్యదర్శిగా ఆకుల రవి, కోశాధికారిగా వలవల బాబ్జీలు సంఘ భవనంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్, సెక్రటరీలు దుగ్గిన రాము, యడ్ల సత్యనారాయణ, ట్రెజరీ పితాని సత్యనారాయణలు నూతన కార్యవర్గంకు బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో హోటల్స్ అసోసియేషన్ చినిమిల్లి గణపతిరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వికలాంగుల పట్ల ఓపికతో మెలగాలి : ఎంపిడిఒ

మొగల్తూరు : వికలాంగుల పట్ల ఓపికగా మసులుతూ వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి సూచించారు. మొగల్తూరు పంచాయతీ కుక్కలవారి తోటలో ఉన్న భవిత కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగులకు ప్రభుత్వ పరంగా ఏ సహకారం కావాల్సి వచ్చినా తాము అందజేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఎంఇఒ యు.శామ్యూల్ జాన్ మాట్లాడుతూ వికలాంగులకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారికి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. ఆయా కార్యక్రమాలలో ఫిజియోథెరపీ హెచ్.మోసు, ఐఇఎస్ఎస్ ఉపాధ్యాయురాలు శ్రీనివాసు, భవిత, గంగాధరరావు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మొగల్తూరు : మండలంలోని వారతిప్పలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యశాఖ సిబ్బంది బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దంతాలకు, రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి, వైద్య సిబ్బంది, ఎఎన్ఎం దొంగ నీలిమ, ఎంఎల్‌హెచ్‌పి పి.కృప, ఆశా వర్కర్లు వి.హైమ, బి.ఝాన్సీ, అంగన్వాడీ సిబ్బంది ఎం.జ్యోతి ఉన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

ఎడి సిహెచ్.శ్రీనివాస్

వీరవాసరం : రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు అని భీమవరం వ్యవసాయ శాఖ ఎడి సిహెచ్.శ్రీనివాస్ రైతులకు సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన వీరవాసరం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణం బాగానే ఉన్నందు వల్ల ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర అందరూ పొందాలని, అదేవిధంగా ధాన్యం కొనుగోలుకు అవసరం అయిన గోనెసంచులు రైతు సేవా కేంద్రం వద్ద అందుబాటులో వున్నాయని, రైతులకు అవసరం అయిన సలహాలు, సూచనలు ఇవ్వటానికి రైతు సేవా కేంద్రం వద్ద సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతానికి ధాన్యాన్ని అమ్ముకోవాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారిని మించి బాబు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

గణపవరం: గణపవరం డిగ్రీ కాలేజీలో బుధవారం బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఉంగుటూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్ కస్తూరి శిరీష మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల శారీరక, మానసిక ప్రభావాలపై కలిగే ఇబ్బందులను విద్యార్థులకు వివరించారు. బాల్యవివాహాల వల్ల పుట్టే పిల్లలకు హానికరమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, కె.స్వరూపరాణీ, టి.అక్కిరాజు, జి.వెంకట్రావు, జి.వెంకటరమణ, పి.భాస్కరావు, రాణిదుర్గా, బాలమణికంఠ, విద్యార్థులు పాల్గొన్నారు.

తణుకు : సమాజంలో నేటికీ ఆడపిల్లలు, మహిళలు, వృద్ధులపై అత్యాచారాలు, వివక్షలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని, వాటిని ఎదుర్కోవడానికి విద్యను ఒక ఆయుధంగా మలచుకోవాలని కళాశాల మహిళా సాధికారత విభాగం కన్వీనర్ ఎ.మారుతీదేవిచౌదరి అన్నారు. బుధవారం స్థానిక శ్రీచిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాల(స్వయంప్రతిపత్తి)లో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో లింగ వివక్షత, మహిళలపై జరుగుతున్న దాడులు-వాటి నిర్మూలనలో బాలికా విద్య ఆవశ్యకత అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న వివిధ రకాల దాడులు గురించి, వాటికి గల ఆర్థిక, సామాజిక కారణాల గురించి కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జి.ఇందిరాదేవి, చాముండేశ్వరిదేవి, కనకమహాలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్‌కు మలేషియా వెళ్లి వచ్చిన అనాథాశ్రమ విద్యార్థులకు భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ ఆవరణలోని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ క్రీడల్లో కరాటే మహా ఆసక్తి కలిగిన క్రీడ అని, తనకు తాను రక్షించుకోవడానికి కరాటే ఒక ఆయుధమన్నారు. చిన్నారులైనా.. కరాటే శిక్షణ పొంది అంతర్జాతీయ పోటీల్లో బంగారు పతకాలు సాధించడం గొప్ప విశేషమని తెలిపారు. భీమవరం ఇమ్మానుయేల్ అనాథ ఆశ్రమంకు చెందిన విద్యార్థులు అశ్విని, ప్రియ, జెర్సీలు ఇటీవల మలేసియాలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు పతకం, సిల్వర్ మెడల్స్ సాధించారని తెలిపారు. విశేష ప్రతిభ కనబరిచి భీమవరం వచ్చిన వారికి ఘన స్వాగతం పలుకుతున్నామని అన్నారు. చిన అమిరం ఇమ్మానుయేల్ అనాథాశ్రమంలో విద్యార్థులను ప్రత్యేక సభ ఏర్పాటు చేసి పలువురు అభినందించారు. కోచ్ వి.భాస్కరరావు మాట్లాడుతూ గత మూడేళ్లుగా ఈ విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని, మలేసియా పోటీల్లో అనేక దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నా 16 మంది మాత్రమే తుది పోరుకు రాగా, వారిలో ఈ ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు, సిల్వర్ మెడల్స్ సాధించారని తెలిపారు. అనాథ ఆశ్రమం నిర్వాహకులు ఎస్ఎస్ పాల్, పూర్ణ చంద్రరావు మాట్లాడుతూ ఈ పోటీలకు వెళ్లడానికి దాతలు ఎంతోమంది సహకరించారని, త్వరలో ఒలింపిక్స్‌కు వెళ్లడానికి అందరి సహకారం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిచంద్ర ప్రసాద్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ రంగరాజు

గృహవిజ్ఞాన శాస్త్రం సైంటిస్ట్ డెబోరా

ప్రజాశక్తి - ఉండి

ఉపాధ్యాయుడిగా వృత్తిలో రాణించి, బహుముఖ ప్రజ్ఞాశాలిగా విశేష ప్రతిభ కలిగి డాక్టరేట్ పొందిన గాదిరాజు రంగరాజు మాస్టార్ అభినందనీయులని గృహవిజ్ఞాన శాస్త్రం సైంటిస్ట్ డెబోరా మెస్సియానా అన్నారు. ఉండి మండలం ఎన్ఆర్‌పి అగ్రహారం చెరువుగట్టుపాలెం ప్రాథమిక పాఠశాలలో బుధవారం గాదిరాజు రంగరాజు మాస్టారును పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ ముక్కు వెంకట సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గృహవిజ్ఞాన శాస్త్రం సైంటిస్ట్ డెబోరా మెస్సియానా మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటమే కాకుండా బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రజలను చైతన్య పరుస్తూ నాటకంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందటం అభినందనీయం అన్నారు. అనంతరం రంగరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచి, లయన్స్ క్లబ్ మాజీ జోన్ ఛైర్మన్ కన్నెగంటి రూత్ కళ, మాజీ సర్పంచి కౌరు కోటేశ్వరరావు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు పాలతీర్థపు నర్సింగరావు, పాఠశాల హెచ్‌ఎం పులిదిండి సత్యం, పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్ పద్మ, మాజీ ఛైర్మన్ శ్రీలక్ష్మి, అంగన్వాడీ టీచర్ లలిత, అంజమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

గానగాంధర్వుడు ఘంటసాల

ఘనంగా జయంతి వేడుకలు

ప్రజాశక్తి - తణుకు

గానగాంధర్వుడు ఘంటసాల అని సాహితీ సామ్రాజ్యం అధ్యక్షులు తాడినాడ భాస్కరరావు అన్నారు. బుధవారం సాహితీ సామ్రాజ్యం(తెలుగు భాషా సాంస్కృతిక కళల వేదిక) ఆధ్వర్యంలో స్థానిక ఎకెటిపిజెడ్‌పి హైస్కూల్ ప్రాంగణంలో పద్మశ్రీ ఘంటసాల జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయులు తాళాబత్తుల రామకృష్ణ మాట్లాడుతూ పాటల దేవుడిగా కొలవబడే ఆరాధ్యుడు, తెలుగుతల్లి గారాల సుపుత్రుడు ఘంటసాల అని అన్నారు. ఈ సందర్భంగా ఘంటసాల పాడిన పాటలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు తాళాబత్తుల రామకృష్ణ, ఉపాధ్యాయురాలు కర్నాటి అరుణను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎలిపే సుజాత, పిఎన్.విజయలక్ష్మి, పి.శ్రీదేవి, ఎస్‌కె.రజియా, డి.మంగతాయారు, వి.రజ నీకుమారి పాల్గొన్నారు.


తణుకు : అమృత అమర గాంధర్వ గాయకుడు ఘంటసాల అని వావిలాల సరళాదేవి అన్నారు. బుధవారం ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా ఎన్‌టిఆర్ పార్కు వద్ద ఉన్న ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సరళాదేవి మాట్లాడుతూ ఘంటసాల మన రాష్ట్రంలో పుట్టడం మన పూర్వ జన్మసుకృతమని, ఆయన జీవిత చరిత్ర నేటి యువతరం గాయకులు స్ఫూర్తిగా తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం ఆర్కెస్ట్రా రాజు, స్వరాంజలి గాయకుడు భాస్కర్ ఘంటసాల పాటలను వారి మధుర గానంతో ఆలాపించారు. ఈ కార్యక్రమంలో షణ్ముఖ విజయ, సుబ్రహ్మణ్య సిద్ధాంతి, కడియాల సూర్యనారాయణ, కౌరు వెంకటేశ్వర్లు, కామేష్, నక్కా రామారావు, ఆకురాతి శ్రీనివాస్, బత్తుల వెంకటరమణ, కె శ్యామల, కళాంజలి, రమణ, జ్యోతి, రమణి పాల్గొన్నారు.

ఆకివీడు : ఎందరినో తన గానంతో అలరించిన గాన గంధర్వుడు, రాయికి రాగాలు నేర్పిన మహా గాయకుడు ఘంటసాల అని తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు అన్నారు. సినీ నేపథ్య గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి సందర్భంగా స్థానిక దొరగారి చెరువు గట్టున ఉన్న ఘంటసాల విగ్రహానికి స్థానిక లలిత కళా సంస్కృతిక సంస్థ సరిగమ సంగీత పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తహశీల్దార్ మాట్లాడుతూ ఘంటసాల గాయకుడే కాకుండా గొప్ప దేశభక్తుడు కూడా అన్నారు. తెలుగు భాష కోసం సేవలందించిన మహానుభావుడు అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు, పతంజలి యోగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ బలరాం ప్రతాప్ కుమార్, పతంజలి యోగాచార్య కందుల సత్యనారాయణ పాల్గొన్నారు.

ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలి : జెసి

ప్రజాశక్తి - పాలకోడేరు

శృంగవృక్షం ఎస్‌విఎస్ రైస్ మిల్లును జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ధాన్యం తీసుకు వచ్చిన రైతులతో మాట్లాడారు. ధాన్యం తూకం తూచే మిషన్లు పరిశీలించారు. రైస్‌మిల్లు రిజిస్టర్లు, కంప్యూటర్ డేటాను పరిశీలించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటలలోపు వారి ఖాతాలకు సొమ్ము జమచేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైతులు వారి సమీప రైతు సేవా కేంద్రాన్ని సంప్రదిస్తే ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేసే సిబ్బంది స్వయంగా కల్లాల వద్దకు వచ్చి ధాన్యాన్ని పరీక్షించి, రైతులు కోరిన రైసు మిల్లుకు తరలించడం జరుగుతుందని తెలిపారు. రైతులు అమ్మిన ధాన్యానికి రైతు ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాలో ధాన్యం సొమ్ము జమచేయడం జరుగుతుందన్నారు. జెసి వెంట రెవెన్యూ, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పాలకొల్లు : రైతులతో మాట్లాడుతున్న జెసి

పాలకొల్లు : రైతు సేవా కేంద్రాల ద్వారా నచ్చిన రైసు మిల్లులకు ధాన్యాన్ని పంపాలని, మధ్యవర్తులకు అమ్ముకోవద్దని జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం పోడూరు మండలం పండితవిల్లూరులో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం రైసు మిల్లు తనిఖీ చేసి, రిజిస్టర్లను, కంప్యూటర్ డేటాను పరిశీలించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని సకాలంలో దిగుమతి చేసుకుని రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. రైతులకు ఏ సమయంలోనైనా ఏవిధమైన సహకారం కావాలన్నా జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు.

అంబేద్కర్ వర్ధంతి సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని ట్యాక్సీ స్టాండ్ సమీపంలో శుక్రవారం మాలల ఐక్యవేదిక కమిటీ అధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి సభను విజయవంతం చేయాలని కమిటీ నాయకులు కోరారు. బుధవారం ఆర్‌డిఒ దాసిరాజుకు సభకు విచ్చేయాలంటూ ఆహ్వాన పత్రికను అందించారు. ఇప్పటికే గ్రామ, వార్డులు, మొగల్తూరు మండలాల్లోని దళితులందరికీ ఆహ్వాన పత్రికలు అందించామన్నారు. ఉదయం 8 గంటలకు జరిగే సభకు పెద్ద ఎత్తున దళితులు హాజరుకావాలన్నారు. అనంతరం విందు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజేటి కెనడి, కాకిలేటి అనందకుమార్, కొల్లాబత్తుల రవికుమార్, దిలీఫ్ కుమార్, చిన్నం వెంకట్రావు పాల్గొన్నారు.

ఎన్‌సిసి క్యాడెట్లు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రతి ఎన్‌సిసి క్యాడెట్ క్రమశిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని కాకినాడ గ్రూప్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కల్నల్ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల 7 ఆంధ్రా నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్‌సిసి క్యాంపును ఆయన సందర్శించి క్యాడెట్స్‌నుద్దేశించి మాట్లాడారు. ఎన్‌సిసిలో చేరడం వల్ల శరీర ధృడత్వం పెరుగుతుందన్నారు. క్యాంపులకు వెళ్లడం వల్ల దేశంలోని విభిన్న ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు, భాషలపై అవగాహన కలుగుతుందన్నారు. అనంతరం క్యాడెట్స్ కలిసి భోజనం చేశారు. లెఫ్టినెంట్ కల్నల్ అనిల్ మెహ్రా, క్యాంపు యూనిట్ కమాండర్ వైపిపి ప్రదీప్, డిప్యూటీ క్యాంపు కమాండర్ లెఫ్టినేట్ సంజీత్ రాత్రే, రాము పాల్గొన్నారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

పాలకోడేరు : మండలంలో ఈనెల 6 నుంచి 17 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దారు ఎన్‌బి.విజయలక్ష్మి తెలిపారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యాలయాల వద్ద జరిగే ఈ సదస్సుల్లో భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. 6న కుముదవల్లి, శృంగవృక్షం, 7న గొరగనమూడి, పెన్నాడ అగ్రహారం, 10న విస్సాకోడేరు, వేంద్ర, 11న గరగపర్రు, గొల్లలకోడేరు, 12న కోరుకొల్లు, మైప మోగల్లు, పాలకోడేరు, 17న కొండేపూడి, వేంద్ర అగ్రహారంలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు తెలిపారు.